దళితుల హక్కుల పరిరక్షణకు చర్యలు

అమర్తలూరు (వేమూరు): అంటరానితనం నిర్మూలనకు, దళితుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని డెప్యూటీ తహసీల్దారు రాజా రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడలో సోమవారం దళితుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో దళితులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలతని సూచించారు. తాము తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డెప్యూటీ తహసీల్దారు రాజారమేష్

ప్రభుత్వ ఆఫీసులకు శాశ్వత భవనాలు కట్టించాలి



ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న వేదిక ప్రతినిధులు

రేపల్లె: రేపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పడి మూడు సంవత్సరాలు అవుతున్నా డివిజనల్ స్థాయి శాశ్వత కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవటం శోచనీయమని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్ బాబు అన్నారు. కార్యాలయాల ఏర్పాటు విషయమై ఆర్డీవో రామలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పట్టణంలో ఆర్ అండ్ బీ డివిజనల్ కార్యాలయం, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, డీఎస్పీ, ఆర్టీవో తదితర డివిజనల్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు లేకపోవటంతో ఇటు అధికారులు, అటు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యాలయాలకు స్థల సేకరణ చేసి, భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యాలయాలు ఏర్పడితే ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. పాలకులు, అధికారులు స్పందించి కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లూరు సాయికృష్ణమాచార్యులు, బిట్రా వెంకట మోహనరావు, కొడాలి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



వైద్య కేంద్రంగా బాపట్ల

గుంటూరు, చీరాలకు వెళ్లే అవసరం లేకుండా అందుబాటులోకి సేవలు



బాపట్లలోని ప్రముఖ గుండె ఆసుపత్రి

బాపట్ల: విద్యా కేంద్రంగా ఉన్న బాపట్ల నేడు వైద్య కేంద్రంగా కూడా మారింది. ఒకప్పుడు చిన్నపాటి వైద్య సేవలు కావాలంటే గుంటూరు, చీరాల వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. నేడు ఆ పరిస్థితి మారి, అందరి చూపు బాపట్ల వైపు పండింది. జిల్లా కేంద్రానికి తగినట్లుగా వివిధ రకాలైన స్పెషలిస్టులతో కూడిన వైద్యశాలలు బాపట్లలో పురుడుపోసుకున్నాయి. చిన్న, చిన్న వ్యాధుల నుంచి గుండె చికిత్సకు సంబంధించి యజ్ఞ వంటి హాస్పిటల్స్ బాపట్లలోనే నెలకొల్పారు. మరోవైపు ఎముకలు, చిన్న పిల్లల డాక్టర్లు, గర్భిణులకు సంబంధించిన వైద్యులు బాపట్లలో అందుబాటులో ఉన్నారు. ఒకప్పుడు గుంటూరు, చీరాలకు వెళ్లే వారు. కానీ ఇప్పుడు చుట్టు పక్కల గ్రామాల నుంచి బాపట్లకు వస్తున్నారు. అందరికీ ఇక్కడ వైద్య భరోసా లభించింది.

అందుబాటులోకి ల్యాబ్‌లు కూడా..

ఒకప్పుడు వైద్య పరీక్షలకు గుంటూరు, విజయవాడకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం రక్తపరీక్షల నుంచి ఎంఆర్ఐ స్కానింగ్ వరకు, ఎముకలకు సంబంధించిన అధునాతనమైన పరీక్షలు కూడా బాపట్లలోనే చేసుకునేలా ఏర్పాటు చేశారు. ప్రతి ప్రైవేటు హాస్పిటల్‌కు ఒక అంబులెన్సు వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చారు. ప్రైవేటు వైద్యశాలల్లో మెరుగైన వైద్యం లభించేలా అధునాతనమైన పరికరాలు ఉన్నాయి.

పెరిగిన ఉద్యోగావకాశాలు

ప్రైవేటు వైద్యశాలల సంఖ్య భారీగా పెరగటంతో ఉద్యోగావకాశాలు కూడా మెండుగా ఉన్నాయి. ఒక్కొక్క హాస్పిటల్‌లో కనీసంగా 25 నుంచి 50 మందికి ఉద్యోగాలు లభించాయి. ఆసుపత్రిలో ఓపీల నుంచి నర్సింగ్ విభాగం, ఆపరేషన్ థియేటర్ల నిర్వహణ వరకు ఉపాధి కల్పన దిశగా అడుగులు పడ్డాయి.

అన్నిరకాల మందులు లభ్యం

బాపట్లలోని వారు ఒకప్పుడు వివిధ మందులు కావాలంటే గుంటూరు, చీరాల వెళ్లక తప్పని పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఏ రకమైన మందులైనప్పటికీ బాపట్లలోనే లభిస్తున్నాయి. మందుల షాపుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

మానవ హక్కుల పరిరక్షణకు చర్యలు

బలిజేపల్లి (వేమూరు): మానవ హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. దీంతో స్థానికులు మాట్లాడుతూ మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నామని, వెంటనే తగిన చర్యలు తీసుకుని ఇబ్బందిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి. ఆర్వో ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులపై శ్రద్ధ ముఖ్యం



కర్లపాలెం: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల పట్ల భవిత సెంటర్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సహిత విద్య సమన్వయ కర్త ఎం.జ్యోత్స్న చెప్పారు. ఇందిరానగర్ గ్రామంలోని భవిత సెంటర్‌ను సోమవారం ఎం.జ్యోత్స్న, ఎంఈవో-2 విజయశ్రీ కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అర్థమయ్యే రీతిలో బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డి.శైలజ, ఐఈ ఆర్పీలు లక్ష్మీ ప్రసన్న, చందన, సిబ్బంది శైలజ, భవాని, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఇంటర్ చదివేందుకు పేద విద్యార్థి టి.గౌతమ్‌కి సోమవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సాయంగా అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.భాస్కరశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి



రేపల్లె: పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎజెండాలోని 10 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా, గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, కౌన్సిలర్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ టీవీ ప్రసారాల్లో అంతరాయం

బాపట్ల: బాపట్ల పరిసర ప్రాంతాల్లో కేబుల్ టీవీ, ఇంటర్నెట్ ప్రసారాల సేవల్లో తాత్కాలిక అంతరాయం కలుగుతోందని ఆపరేటర్లు తెలిపారు. బాపట్ల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాల సుందరీకరణలో భాగంగా స్తంభాలు తొలగించటం, మరమ్మతులు చేయటంతో వాటికి ఉన్న ఇంటర్నెట్, కేబుల్ వైర్లు తొలగించటంతో కొద్ది సేపు సేవలు నిలుపుదల అవుతాయని తెలిపారు. సరఫరా నిలిచిపోయిన వెంటనే మరికొద్దిసేపులోనే తిరిగి వాటిని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.